# నియోజకవర్గ అభివృద్ధే నా ధ్యేయం

- వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ పార్టీలో పలువురు చేరిక

వనపర్తి,అక్టోబర్ 29: నియోజకవర్గంలోని ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి చేసాం, సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా ఎంతో చేశానని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రాజనగరం, వడ్డేవీధి, ఖిల్లాఘణపురం మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన పలువురు ఆదివారం జిల్లాకేంద్రంలోని మంత్రి నివాసం వద్ద ఆ యన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ముందుగా వా రికి మంత్రి గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాజనగరం గ్రామాన్ని పట్టణంలో కలపడంతోపాటు గ్రామ చెరువుకు సుందరీకరణ పనులు చేపట్టామని తె లిపారు. ఇప్పటివరకు వాటిలో పావువంతు మాత్రమే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. పట్టణంలోని మురుగు మొత్తం ఈ చెరువులోకి వెళ్తుందని, దాంతో ఈ ప్రాంత భూగర్భ జలాలు విషతుల్యం అవుతున్నాయని, దాని వల్ల పండించిన పంటలు, తాగే నీరు అన్నీ కూడా విషతుల్యమై ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. దానికి పరిష్క రించేందుకు ఇప్పటికే ఓ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. మురుగును ట్రీట్మెంట్ ప్లాట్‌లను ఒకటి అమ్మచెరువు, నల్ల చెరువు వద్ద ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అలాగే ఈ ప్రాంతానికి అమ్మచెరువును ఆహ్లాదకరమైన వాతావరణ కేంద్రంగా మార్చబోతున్నమన్నారు. పట్టుబట్టి జిల్లాను ఏర్పాటు చేసుకొని ఒక్కొక్కటిగా పనులు పూర్తి చేసుకుంటూ ఉపాధికి నిలయంగా పట్టణాన్ని మార్చుకున్నామన్నారు. ప్రతి ఒక్కరికీ బతుకు దెరువుపై ఆలోచనతో ఉన్నతంగా జీవించాలన్నారు. అభివృద్ధి మీ కండ్ల ఎదుటే కనబడుతుందని, మరింత అభివృద్ధికి అవకాశం కల్పించాలని కోరారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన పర్వతాపురం గ్రామానికి చెందిన నాయకులతో మంత్రి నిరంజన్‌రెడ్డి

## కారు గుర్తుకు ఓటు..
# అభివృద్ధికి మలుపు

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం..
- కాంగ్రెసోళ్లు ఎన్ని కట్టలు పంచినా గెలుపు బీఆర్‌ఎస్‌దే..
- సీఎం కేసీఆర్ సారథ్యంలో ప్రగతి పథంలో పల్లెలు
- గద్వాల పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందాం
- నది అగ్రహారం, వెంకంపేట గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



నదీ అగ్రహారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్, అక్టోబర్ 29 : కారు గుర్తుకు వేసే ఓటు అభివృద్ధికి మలుపు అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ వారు ఎన్ని కట్టలు పంచినా గెలుపు మాత్రం బీఆర్‌ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం గద్వాల పట్టణ పరిధిలోని నది అగ్రహారం, వెంకంపేట గ్రామాల్లో ఎమ్మెల్యే అభివృద్ధి, సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అదేవిధంగా పవిత్రమైన కృష్ణానది వద్ద ఉన్న ఆలయంలో కొలువైన పరమేశ్వరునికి, కృష్ణా నదిలో గంగమ్మ తల్లికి ఎమ్మెల్యే పూజలు చేశారు. అనంతరం కురుమ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు గొర్రె పిల్లను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా బీఆర్‌ఎస్ పాలనలో పల్లెలన్నీ ప్రగతి పథంలో ముందుకు సాగుతున్నాయన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా గద్వాల పట్టణంలోని అన్ని వార్డులనూ అభివృద్ధి చేసుకున్నామని, సంక్షేమ పథకాలను అమలు చేసుకుంటూ దేశంలోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో ఆసరా పింఛన్లు, రైతుబంధు పెంపుతోపాటు, మహిళల కోసం ప్రత్యేక స్కీంలు ప్రకటించారని, అర్హులైన మహిళలకు నెలనెలా జీవన భృతి, పేద మహిళలకు రూ.400కే సిలిండర్ అందిస్తామని వివరించారు. తెల్ల కార్డు కలిగిన ప్రతి పేదింటికీ రైతుబీమా తరహాలో రూ.5లక్షల జీవిత బీమా, ఆసర పింఛన్‌ను రూ.5వేలకు పెంచినట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీ నాయకుల కుట్రపూరితమైన మాటలు నమ్మొద్దన్నారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్, గద్వాల ఎమ్మెల్యేగా తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, గద్వాల టౌన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గోవిందు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్‌నాయుడు, కోటేశ్, మురళి, యూత్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే గోస తప్పదు

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- కారెక్కిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

గద్వాల, అక్టోబర్ 29 : బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా గులాబీ జెండా ఎల్లప్పుడూ ఉంటుందని గద్వాల ఎమ్మె ల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మల్దకల్ మం డలం పాల్వాయి గ్రామానికి చెందిన వార్డుసభ్యుడు పరశురాముడితోపాటు మరికొందరు బీఆర్‌ఎస్‌లో చేరారు. గట్టు మండలం ఇందువాసి, మాచర్ల గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు చిన్నహనుమంతు, కర్రెప్ప, లక్ష్మన్న, నాగరాజు, భీముడు, రంగారెడ్డి, నరేశ్‌గౌడ్, వీరేశ్‌గౌడ్, వీరన్నగౌడ్, ముని, మునెప్ప, గోపాల్, ఇంజన్న, నర్సప్ప, నరసింహులు, వెంకటేశ్, తిమ్మప్పతోపాటు 60 మంది, గద్వాల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వరలక్ష్మి, మాజీ ఎంపీటీసీ వెంకటన్నతోపాటు బాలకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రామలక్ష్మి, బన్ని, దేవదాస్, ప్రవీణ్, కృష్ణతోపాటు 50మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కర్ణాటక ఉప ముఖ్యమంత్రి తెలంగాణకు వచ్చిన సమయంలో తమ రాష్ట్రంలో ఐదు గంటల కరెంటే ఇస్తున్నామని చెప్పాడన్నారు. ఇక్కడున్న కాంగ్రెసోళ్లకు ఓటు వేస్తే తెలంగాణలోనూ అదే పరిస్థితి ఉంటుందని.. అలాంటి పార్టీకి ఓటు వేస్తారా అని ప్రశ్నించారు. ఆ పార్టీ ఇచ్చే హామీలు నమ్మి ఓటు వేస్తే మరోసారి మనకు గోస తప్పదన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు మళ్లీ రాష్ట్రంలో కొనసాగాలంటే బీఆర్‌ఎస్‌కే ఓటు వేయాలని కోరారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తీర్చుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, కౌన్సిలర్ నాగిరెడ్డి, ఉపసర్పంచ్ రంజిత్, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, సర్పంచ్ అశోక్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, భాస్కర్, రాజుగౌడ్, తిమ్మప్ప, జీవన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బండ్ల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు



అధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

# సాగునీటి విడుదలకు సన్నాహాలు

- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

మానవపాడు, అక్టోబర్ 29 : ఆర్డీఎస్ కింది రైతులకు సాగునీటిని అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. మానవపాడు మండలం పెద్ద పోతులపాడుకు చెందిన సర్పంచ్ పరిమల కుమారుడు ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. సమాచారం తెలుసుకున్న మానవపాడు, అమరవాయి, గోకులపాడు, చెన్నిపాడు గ్రామాల రైతులు ఎమ్మెల్సీని కలిసి మాట్లాడారు. పంటలు ఎండిపోతున్నాయని, ఒక్కతడికైనా సాగు నీరు అందించాలని కోరారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ కొన్ని రోజులుగా సాగునీటి విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. కర్నూల్ ఎస్ఈకి ఫోన్ చేసి నీటి విడుదలకు సహకరించాలని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సహకరిస్తామని చెప్పారు. తెలంగాణకు ఉన్న ఇండెంట్‌ను విడుదల చేయించి పంటలను కాపాడుతామని హామీ ఇచ్చారు.

# కార్యకర్తలకు అండగా ఉంటాం

- అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

రాజోళి, అక్టోబర్ 29 : కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కార్యకర్తల అభివృద్ధే పార్టీ ముఖ్య లక్ష్యమని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం పేర్కొన్నారు. కొన్ని రోజుల కిందట జరిగిన ప్రమాదంలో రాజోళికి చెందిన శ్రీరాంరెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే ఆదివారం పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం శ్రీరాంరెడ్డి అభిమానులతో సమావేశమై మాట్లాడారు. నిరంతరం గ్రామాభివృద్ధికి కృషి చేసిన శ్రీరామ్‌రెడ్డి మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటని, ఆయన అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించుకునే వారని గుర్తు చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. సమావేశంలో ఆర్డీఎస్ మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ సుగుణమ్మ, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు నిషాక్, ఎంపీటీసీలు షాషావలీ, చిట్టెమ్మ, రషీద్, సత్తార్ మియా, సర్పంచ్ భూషణం, గౌరోజీ, మాజీ సర్పంచ్ హుస్సేన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు

- అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

దామరగిద్ద, అక్టోబర్ 29 : పదేండ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలు గమనించి మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాబోయే 30 రోజులు కష్టపడి పనిచేసి అభివృద్ధిని ప్రతిఒక్కరికీ వివరించాలన్నారు. చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ తిరిగి తెలపాలని కోరారు. అనంతరం ధన్వాడ మండలం కాంగ్రెస్ పార్టీకి చెందని 40 మంది యువకులు ఎమ్యెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని, చేపట్టిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బక్క నర్సప్ప, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ భీమయ్యగౌడ్, పీఏసీసీఎస్ అధ్యక్షుడు ఈదప్ప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భీంరెడ్డి, నాయకులు చంద్రకాంత్, పటేల్ బసంత్‌రాజ్ పాల్గొన్నారు.